# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/









## దేశవ్యాప్తంగా నేడు నీట్ పరీక్ష

- మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు నిర్వహణ
- ఫుల్ షర్టు, షూస్, హైహీల్స్ నిషేధం
- రాష్ట్రం నుంచి 73 వేల మంది హాజరయ్యే అవకాశం
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

హైదరాబాద్: వైద్య విద్యలో ప్రవేశాలకు నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్--యూజీ) ఆదివారం జరగనుంది.



## ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీజేపీ ప్రచార జోరు

- మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ
- గోడపై నినాదాలు రాసి ప్రచారం ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- స్వయంగా కమలం పువ్వు గుర్తును చిత్రించిన కిషన్ రెడ్డి
- కార్యకర్తల్లో ఉత్సాహం కనిపిస్తోందన్న కేంద్రమంత్రి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో భారతీయ

## కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం కల్ల

- రెండున్నరేళ్ల పాలనలో అవినీతి అడ్డగోలుగా పెరిగింది
- వాళ్ల స్కాంలను చూసి ప్రజలు మరో 20 ఏళ్లు ఓటేయరు
- కేంద్రం గ్యాస్ ధరలు పెంచినందుకు నిరసనలు తెలపాలి
- పార్టీ రంగారెడ్డి జిల్లా నేతలతో సమీక్షలో కేటీఆర్

రంగారెడ్డిజిల్లా: 'రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో భూ కుంభకోణాలు, అరాచకాలు మినహా ప్రజలకు చేసిందేమీ లేదు. ఆ పార్టీ అరాచకాలు చూసి ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ప్రజలు వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు వేసే అవకాశం లేదు. ఆ పార్టీ మరో 20 ఏళ్ల వరకు అధికారంలోకి రావడం కల్ల'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి అడ్డగోలుగా పెరిగిపోయింది.





## 'పది' రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తులకు 7 వరకు గడువు

అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల రీ--కౌంటింగ్, రీ--వెరిఫికేషన్ కోరే విద్యార్థులు ఈ నెల ఏడో తేదీలోగా తమ పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని

## ఉద్యోగులకు సీఎం రేవంత్ వరాలు..

- పీఆర్సీపై కీలక ఆదేశాలు
- ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు కీలక హామీలు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి
- జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు, 100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు
- వేతన సవరణపై పీఆర్సీ నివేదికను వెంటనే ఇవ్వాలని ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయాలతో మే 5న తలపెట్టిన ధర్నాను విరమించుకున్న ఉద్యోగ సంఘాలు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి



తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాలుగు కీలకమైన శుభవార్తలు చెప్పారు.

## చంద్రబాబుకు అమరావతిపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు: విడదల రజిని



- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదన్న రజిని
- అమరావతి నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని ఆరోపణ
- జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని వ్యాఖ్య

కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజని నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతిలోని అద్దాల మేడలపై ఉన్న ప్రేమ సామాన్య ప్రజలపై లేదని ఆమె మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక కనీసం ఒక్క కొత్త పెన్షన్ అయినా ఇచ్చారా అని ప్రశ్నించిన ఆమె, జగన్ హయాంలో 66 లక్షలకు పైగా ఉన్న పెన్షన్లలో ఇప్పుడు ఏకంగా 6 లక్షల

## ముందస్తుగా నైరుతి పవనాలు..

త్వరగా నిష్క్రమణపై చెప్పలేమన్న ఐఎండీ



## సింగపూర్ పర్యటనకు ఏపీ బెస్ట్ టీచర్లు...

- మంత్రి నారా లోకేష్ స్పందన
- శిక్షణ కోసం సింగపూర్‌కు 37 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో 5 రోజుల ప్రత్యేక కార్యక్రమం
- ఆధునిక బోధన పద్ధతులపై టీచర్లకు శిక్షణ
- ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితే తరగతి గది మారుతుందన్న మంత్రి లోకేష్



ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 మంది ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులను

## హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ ను పరామర్శించిన సీఎం చంద్రబాబు

- గత కొంతకాలంగా పవన్ కు అనారోగ్య సమస్యలు
- ఇటీవలే హైదరాబాద్‌లో శస్త్రచికిత్స
- హైదరాబాద్‌లోని పవన్ నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన చంద్రబాబు
- శస్త్రచికిత్స నేపథ్యంలో తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచన
- తన నివాసానికి వచ్చిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పవన్



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం చంద్రబాబు జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసానికి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు



## ఎగ్జిట్ పోల్స్ వెనుక కుట్ర

- స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేయడానికి సాధనంగా వాడుకుంటున్నారు
- అసెంబ్లీ ఎన్నికల్లో 200కుపైగా సీట్లు గెల్చుకుంటాం
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధీమా

కోల్‌కతా: ఎగ్జిట్ పోల్స్ పేరుతో స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేసే కుట్ర సాగిస్తున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ మమతా బెనర్జీ ధ్వజమెత్తారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# దేశవ్యాప్తంగా నేడు నీట్ పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాయి. పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెన్--పేపర్ విధానం ద్వారా జరిగే ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 23 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరవుతున్నారురాష్ట్రంలో 73 వేల మందికిపైగా విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 150కిపైగా పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ వంటి ప్రధాన నగరాల్లో ఎక్కువ సెంటర్లు ఉన్నాయి. ప్రతి కేంద్రంలో సీసీటీవీ పర్యవేక్షణ, బయోమెట్రిక్ హాజరు నమోదు వంటి విధానాలు అమలు చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం: నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎన్‌టీఏ విధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. పరీక్ష రాసేందుకు వచ్చేటప్పుడు అడ్మిట్ కార్డ్, ఫొటో ఐడీ తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుంది. పరీక్ష ప్రారంభానికి కనీసం ఒక గంట ముందే హాజరు కావాలి. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం. ఫుల్‌హ్యాండ్స్ దుస్తులు, షూస్ ధరించరాదు.

ట్రాన్స్‌పరెంట్ పెన్ మాత్రమే అనుమతిస్తారు. మెటల్ వస్తువులు, ఆభరణాలు నిషేధం. ఇక అమ్మాయిలు హెయిర్‌పిన్‌లు, క్లిప్‌లు, మెటల్ రబ్బర్ బ్యాండ్లు ధరించి వస్తే అనుమతించరు. పెద్ద చెవిపోగులు, గొలుసులు, బంగారు ఆభరణాలు ధరించరాదు. హైహీల్స్, అలంకరణలున్న షూస్ నిషేధం. సాధారణ చెప్పులు/శాండల్స్ మాత్రమే ధరించాలి. ముసుగు లేదా సంప్రదాయ దుస్తులు ధరించే వారు ముందుగా రిపోర్ట్ చేయాలి. అదనపు తనిఖీ జరుగుతుంది. మేకప్ పరిమితంగా ఉండాలి. అనుమానాస్పద వస్తువులు తీసుకురావొద్దు.

**పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు**

వేసవి కాలం కావడంతో పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు ప్రత్యేక సహాయం అందిస్తున్నారు. నీట్ పరీక్షలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, విజిలెన్స్ బృందాలు పనిచేస్తున్నాయి. సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు కూడా ఉంటుంది. పరీక్షను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

## సింగపూర్ పర్యటనకు ఏపీ బెస్ట్ టీచర్లు...

ప్రత్యేక శిక్షణ కోసం సింగపూర్‌కు పంపింది. ఈ బృందం సింగపూర్ పర్యటనకు వెళ్లడం పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సింగపూర్‌లో ఐదు రోజుల పాటు జరిగే ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. ఆధునిక బోధన పద్ధతులు, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను (క్రిటికల్ థింకింగ్) పెంపొందించడం, విద్యార్థి కేంద్రిత బోధన వంటి అంశాలపై వీరికి లోతైన అవగాహన కల్పించనున్నారు. ప్రపంచ స్థాయి ఉత్తమ విద్యా విధానాలను నేర్చుకుని, వాటిని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని మంత్రి లోకేష్ వివరించారు."ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితేనే తరగతి గది రూపాంతరం చెందుతుంది" అనే బలమైన ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. ఈ అంతర్జాతీయ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల నైపుణ్యాలు మెరుగుపడి, రాష్ట్ర విద్యా వ్యవస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన సీఎం చంద్రబాబు



పవన్ కల్యాణ్, ఆయన భార్య అనా కొణిదెల సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఆరోగ్యం పూర్తిగా కుదుటపడే వరకు తగిన విశ్రాంతి తీసుకోవాలని పవన్‌కు సూచించారు.ఈ సందర్భంగా ఇరువురు నేతలు కాసేపు సమావేశమై రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై క్లుప్తంగా చర్చించుకున్నట్లు సమాచారం. తన ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉద్యోగులకు సీఎం రేవంత్ వరాలు..



(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో శనివారం జరిగిన సమావేశంలో వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. ఈ నిర్ణయాలతో సంతృప్తి చెందిన ఉద్యోగ సంఘాలు, మే 5న తలపెట్టిన ధర్నాతో పాటు ఇతర నిరసన కార్యక్రమాలను విరమించుకుంటున్నట్లు ప్రకటించాయి. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో ఉద్యోగుల సేవలను సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

జూన్ 1 నాటికి హెల్త్ కార్డులు

ఉద్యోగులందరికీ ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలన్న ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, జూన్ 1వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి కార్డులు అందజేస్తుందని స్పష్టం చేశారు.

100 రోజుల్లో రూ.6000 కోట్ల బకాయిల చెల్లింపు

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే 100 రోజుల్లో రూ.6,000 కోట్లను విడుదల చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ నిధులను ఏ ప్రాధాన్యతా క్రమంలో ఎవరికి ముందుగా చెల్లించాలనే నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలకే వదిలివేస్తున్నట్లు ఆయన తెలపడం విశేషం.

పీఆర్సీ నివేదికపై తక్షణ ఆదేశం

ప్రభుత్వ ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ (పీఆర్సీ) అంశంపైనా సీఎం స్పష్టత ఇచ్చారు. పీఆర్సీ నివేదికను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలని సంబంధిత కమిషన్‌ను ఆదేశించారు. నివేదిక అందిన వెంటనే జీతాల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ఇందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 67,760 ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

**రెండు నెలలకోసారి సమావేశం**

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర సంప్రదింపుల ప్రక్రియను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇకపై ప్రతి రెండు నెలలకోసారి ఉద్యోగ సంఘాలు సమావేశమై, తమ సమస్యలు, ఆందోళనలపై ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించాలని సూచించారు.

"ఇది ఉద్యోగ స్నేహపూర్వక ప్రభుత్వం, మీ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మాపై ఉంది" అని ఆయన భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించడం, గందరగోళం లేకుండా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడం వంటి చర్యలను ఆయన గుర్తుచేశారు.

## 'పది' రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ దరఖాస్తులకు 7 వరకు గడువు

ఎస్ఎస్‌సీ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రీకౌంటింగ్‌కు రూ .500, రీ--వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున రుసుము చెల్లించాలని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి జవాబు పత్రాలను రీ--వెరిఫికేషన్ కోసం పాఠశాల లాగిన్‌తో పాటు వాట్సప్ గవర్నెన్స్(మన మిత్ర)ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలు కల్పించినట్టు తెలిపారు.

## ఎగ్జిట్ పోల్స్ వెనుక కుట్ర

అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 200కు పైగా సీట్లు గెల్చుకోవడం తథ్యమని మరోసారి ధీమా వ్యక్తం చేశారు. ఆమె శనివారం పార్టీ నేతలు, కార్యకర్తలు, కౌంటింగ్ ఏజెంట్లతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా క్షేత్రస్థాయిలో అవిశ్రాంతంగా పని చేశారంటూ వారిని ప్రశంసించారు. టీఎంసీ గెలుపును ఎవరూ ఆపలేరని ఉద్ఘాటించారు. కచ్చితంగా 200 సీట్లకుపైగా సొంతం చేసుకోబోతున్నామని వెల్లడించారు. స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేయడానికి ఎగ్జిట్ పోల్స్‌ను ఒక సాధనంగా వాడుకుంటున్నారని మమతా బెనర్జీ మండిపడ్డారు. 2021, 2024లోనూ ఇలాంటి కుతంత్రమే సాగించారని దుయ్యబట్టారు. ఇప్పుడు కూడా అదే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. బెంగాల్‌లో భారీగా కేంద్ర బలగాలను మోహరించడాన్ని, బలగాల దుందుడుకు వైఖరిని తప్పుపట్టారు. ఇది తమ పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న క్రూరత్వంగా అభివర్ణించారు. ఓటర్లను, ముఖ్యంగా మహిళలను భయపెట్టడానికి బీజేపీ కేంద్ర బలగాలను వాడుకుంటోందని టీఎంసీ ప్రధాన కార్యదర్శి, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. జవాన్లు ప్రతి గ్రామంలోకి, వీధిలోకి వెళ్లి మహిళలపై దాడి చేశారని, పిల్లలను కూడా వదల్లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మీడియాలోని ఒక వర్గం కూడా వారికి సహకరిస్తోందని విమర్శించారు. ఇదిలా ఉండగా, వర్చువల్ భేటీ ముగిసిన తర్వాత మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

## చంద్రబాబుకు అమరావతిపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు: విడదల రజిని



పెన్షన్లను కట్ చేశారని ఆరోపించారు. 50 ఏళ్లు దాటిన వారికి పెన్షన్ ఇస్తామన్న హామీని కూడా గాలికి వదిలేశారని విమర్శించారు. ఒకవైపు రికార్డు స్థాయిలో అప్పులు చేస్తూ, ఆ నిధులను చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ తమ విలాసాల కోసం, ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్ల ప్రయాణాల కోసం వృథా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణాల పేరుతో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందని, అడుగుకు రూ.18,500 పైనే ఖర్చు చేయడం దేశంలో ఎక్కడా లేని విడ్డూరమని రజిని పేర్కొన్నారు. కేవలం అక్కడ అద్దాల కోసమే రూ.2,500 కోట్లు ఖర్చు చేసే బదులు, ఆ నిధులతో మెడికల్ కాలేజీలు పూర్తి చేయవచ్చని, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించవచ్చని ఆమె సూచించారు. ఆరోగ్యశ్రీకి రూ.4 వేల కోట్ల బకాయిలు పెట్టి సామాన్యుడి వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే అమరావతికి వ్యతిరేకం అంటూ విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని అన్నారు.

## ముందస్తుగా నైరుతి పవనాలు..

న్యూఢిల్లీ, మే 2: ఎండలతో అల్లాడుతున్న పౌరులకు భారత వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. సాధారణంగా వచ్చే దానికన్నా ముందే ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు భారత్‌ను పలకరిస్తాయని తెలిపింది. ఈ నెల 14-16 తేదీల మధ్య నైరుతి రుతు పవనాలు అండమాన్ వచ్చే సూచనలున్నాయని వెల్లడించింది. పలు రీజియన్లలో సాధారణం కంటే అధిక స్థాయిలో వేడి గాలుల దినాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, దేశంలోని మరికొన్ని చోట్ల ఈ నెలలో సాధారణ స్థాయి కంటే ఎక్కువగా వర్షపాతం నమోదవుతుందని వెల్లడించింది. గుజరాత్ లోని సౌరాష్ట్ర, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని దక్షిణ ప్రాంతాలు, ఉత్తర ఉత్తర ప్రదేశ్, బీహార్, తమిళనాడు, ఒడిశా సహా కోస్తా రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ స్థాయిలో వడగాల్పులు వీస్తాయని తెలిపింది. దేశంలో రాత్రి పూట సాధారణం కంటే ఎక్కువ నమోదు కావచ్చునని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించినా, ముందుగానే నిష్క్రమిస్తాయని చెప్పలేమన్నారు.

# కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం కల్ల



అన్ని అంశాల్లోనూ కాంగ్రెస్ పార్టీ కమిషన్లు, కాసుల కక్కుర్తి కోసమే చూస్తుంది. మంత్రులే స్వయంగా రంగారెడ్డి జిల్లాలో భూముల ఆక్రమణతోపాటు మైనింగ్ కుంభకోణాలకు పాల్పడుతున్న పరిస్థితి నెలకొంది. అడ్డగోలుగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాలను మోసం చేసింది'అని దుయ్యబట్టారు. శనివారం నందినగర్‌లోని తన నివాసంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా నేతలతో కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలతోపాటు పార్టీని బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణ, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎక్కడికక్కడ నిరసనలు: 'ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ఈ విధంగా ఉంటే, మరోవైపు కేంద్రంలోని బీజేపీ అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటోంది. వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ.వెయ్యి పెంచింది. అడ్డగోలుగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ వస్తున్న బీజేపీ నిర్వాకం వల్ల ప్రజలపై తీవ్ర భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ అడ్డగోలు నిర్ణయాలపై బీజేపీకి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. మరోసారి ఈ ధరలు పెంచకుండా ఉండేందుకు ప్రజలను జాగృతం చేయాలి'అని కేటీఆర్ పేర్కొన్నారు. త్వరలో జరగనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, తర్వాత జరిగే కమిటీల నిర్మాణంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను కేటీఆర్ పార్టీ నేతలకు వివరించారు. 'రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో బీఆర్ఎస్ చురుకైన పాత్ర పోషించబోతోంది. కాంగ్రెస్, బీజేపీ చేసే అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. ప్రతీ ఒక్క యువతీ, యువకుడికి ఓటు హక్కు కల్పించాలి. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయకుండా చూడాలి. కాంగ్రెస్, బీజేపీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. ప్రజల ఓటు హక్కుకు బాధ్యతగా భరోసాగా నిలవాల్సిన అవసరం ఉంది. దీంతోపాటు త్వరలో మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఆ ఎన్నికలకు సమాయత్తం కావాలి'అని కేటీఆర్ చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీజేపీ ప్రచార జోరు

జనతా పార్టీ ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి గోడలపై నినాదాలు రాసి అందరినీ ఆశ్చర్యపరిచారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఈ ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ నెల 10వ తేదీన సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీ పాల్గొనే భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు ప్రజలను ఆహ్వానిస్తూ "ఛలో పరేడ్ గ్రౌండ్స్" అంటూ కిషన్ రెడ్డి స్వయంగా కుంచె పట్టి గోడపై రాశారు. అనంతరం బీజేపీ ఎన్నికల గుర్తు అయిన కమలం పువ్వును కూడా ఆయనే చిత్రించడం విశేషం.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అభివృద్ధి, పురోగతి దార్శనికతపై ప్రజలు, కార్యకర్తలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని, వారి ఉత్సాహమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి స్వయంగా వాల్ రైటింగ్ చేస్తున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

## భక్తిశ్రద్ధలతో సామూహిక పారాయణం

**- మాఘ పూర్ణిమ పురస్కరించుకుని ఆధ్యాత్మిక శోభ**

**- బిర్రు లక్ష్మి నివాసంలో జై శ్రీమన్నారాయణ భక్త బృందం పూజలు**



**తొలివెలుగు, రాజపేట:** మండల కేంద్రంలో మాఘ పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక సందడి నెలకొంది. జై శ్రీమన్నారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక పారాయణ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రతి నెలా పౌర్ణమి రోజున నిర్వహించే ఆధ్యాత్మిక సత్సంగంలో భాగంగా, ఈ సారి భక్త బృందం సభ్యురాలు బిర్రు లక్ష్మి నివాసంలో విశేష పూజలు నిర్వహించారు.తొలుత అమ్మవారిని, లక్ష్మీనారాయణులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులందరూ కలిసి సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తుల గోవింద నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. ఈ కార్యక్రమంలో భక్త బృందం సభ్యులతో పాటు పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.తొలివెలుగు, రాజపేట: మండల కేంద్రంలో మాఘ పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక సందడి నెలకొంది. జై శ్రీమన్నారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక పారాయణ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రతి నెలా పౌర్ణమి రోజున నిర్వహించే ఆధ్యాత్మిక సత్సంగంలో భాగంగా, ఈ సారి భక్త బృందం సభ్యురాలు బిర్రు లక్ష్మి నివాసంలో విశేష పూజలు నిర్వహించారు.తొలుత అమ్మవారిని, లక్ష్మీనారాయణులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులందరూ కలిసి సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తుల గోవింద నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. భక్త బృందం సభ్యులతో పాటు పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

## నమ్మిన స్నేహితుడే కాలయముడయ్యాడు!

**- రాజపేటలో యువకుడి హత్య.. పారతో బాది ప్రాణం తీసిన నాని**

**- హైదరాబాద్ నుంచి పిలిపించి మరీ ఘాతుకం**

**- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు**



**తొలివెలుగు, రాజపేట:** రాజపేట మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. స్నేహితుడి చేతిలోనే మరో స్నేహితుడు బలైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేటకు చెందిన తాళ్లపల్లి భరత్, తమ్ముడు మధు(25) కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. మధు వృత్తిరీత్యా పెయింటర్. మూడు రోజుల క్రితం తన స్నేహితుడైన జిడ్డు నాని పిలుపు మేరకు మధు రాజపేటకు వచ్చాడు. గురువారం రాత్రి తన తల్లితో ఫోన్‌లో మాట్లాడిన మధు.. తాను నానితో కలిసి రాజపేటలో పెయింటింగ్ పనులు చేస్తున్నట్లు తెలిపాడు.అయితే, శుక్రవారం మధ్యాహ్నం 1:40 గంటల సమయంలో మధు, నాని మధ్య ఏదో విషయమై గొడవ జరిగింది. ఆగ్రహానికి లోనైన నాని పారతో మధుపై తీవ్రంగా దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న మధు సోదరుడు భరత్ తన కుటుంబ సభ్యులతో కలిసి రాజపేట చేరుకుని, రక్తపు మడుగులో పడి ఉన్న తమ్ముడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. తన తమ్ముడిని నానియే హత్య చేశాడని మధు అన్న భరత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజపేట పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ హత్యతో కొత్త కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## ప్రేయసిని వేధిస్తున్నాడనే కక్షతోనే మధు హత్య

**- నిందితుడు జిడ్డు నాని అరెస్ట్: రిమాండ్‌కు తరలింపు**

**- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు**



**తొలివెలుగు, రాజపేట:** ప్రేయసిని ఫోన్ ద్వారా వేధిస్తున్నాడన్న కోపంతో, తనను రెచ్చగొట్టినందుకే తాళ్లపల్లి మధును జిడ్డు నాని అలియాస్ వెంకటేష్ హత్య చేసినట్లు భువనగిరి డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు వెల్లడించారు. శనివారం రాజపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ భాస్కర్, ఎస్ఐ లింగారెడ్డిలతో కలిసి ఆయన కేసు వివరాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం: హైదరాబాద్‌లోని మౌలాలికి చెందిన మధు, రాజపేటకు చెందిన నాని పాత మిత్రులు. ఇద్దరూ కలిసి పెయింటింగ్ పనులు చేసేవారు. అయితే, నాని ప్రేమిస్తున్న యువతికి మధు తరచుగా ఫోన్ చేసి వేధిస్తుండటంతో వారి మధ్య గొడవ మొదలైంది. దీనిపై నిలదీసేందుకు నాని పెయింటింగ్ పని ఉందని చెప్పి మధును మూడు రోజుల క్రితం రాజపేటకు పిలిపించాడు. గురువారం రాత్రి ఇద్దరు కలిసి మద్యం సేవించగా, ఆ సమయంలో యువతి విషయంపై ఘర్షణ జరిగింది. మధు మద్యం మత్తులో నానిని బాటిల్‌తో కొట్టాడు. తనను కొట్టడమే కాకుండా, ప్రేయసిని వేధిస్తున్న మధును వదిలిపెడితే తనకే ప్రమాదమని నాని భావించాడు. ఈ నెల 1వ తేదీ మధ్యాహ్నం మధు తన బంధువులతో కలిసి భోజనం చేస్తున్న సమయంలో నాని అక్కడికి వెళ్లాడు. అక్కడ కూడా మధు రెచ్చగొట్టేలా మాట్లాడటంతో ఆవేశానికి లోనైన నాని, సమీపంలో ఉన్న ఇనుప పారతో మధు తలపై బలంగా కొట్టాడు. తీవ్ర రక్తస్రావమై మధు అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడిపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు తెలిపారు.



## సర్కారు బడి.. సక్సెస్ కీ!



**- పది ఫలితాల్లో సత్తా చాటిన దూదివెంకటాపురం విద్యార్థులు**

**- ప్రైవేట్‌ను పక్కకు నెట్టి.. 'సర్కారీ బడి' రికార్డుల మోత**

**- నూరు శాతం ఉత్తీర్ణతతో ఆదర్శం**

**- అమ్మాయిలదే పైచేయి.. మండల టాపర్లలో తేజస్విని**

**- ఉపాధ్యాయుల సమిష్టి కృషికే దక్కిన ప్రతిఫలం**

**తొలివెలుగు, రాజపేట:** ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు ఏమాత్రం తీసిపోవని, సరైన మార్గదర్శకత్వం ఉంటే సర్కారు బడుల విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తారని రాజపేట మండలం దూదివెంకటాపురం ఉన్నత పాఠశాల నిరూపించింది. ఇటీవల విడుదలైన 2025 - 26 విద్యా సంవత్సరపు ఎస్ఎస్సి ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ముఖ్యంగా ఈ ఫలితాల్లో బాలికలు ప్రభంజనం సృష్టించి మార్కుల వరద పారించారు. మొత్తం 29 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇదే పాఠశాలకు చెందిన గుల్లెన తేజస్విని 564 మార్కులు సాధించి రాజపేట మండలంలోనే నాలుగవ స్థానంలో నిలిచి సత్తా చాటింది. బడిలో 500లకు పైగా మార్కులు సాధించిన 9 మంది విద్యార్థుల్లో 8 మంది అమ్మాయిలే కావడం విశేషం. గుల్లెన తేజస్విని, సంజన, సుస్మిత, ప్రసన్న, మధుప్రియ, శ్రీలేఖ, నవనీత, వర్షిత్, మహాలక్ష్మి అద్భుతమైన మార్కులతో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఈ అద్భుత ఫలితాల వెనుక ఉపాధ్యాయుల శ్రమ దాగి ఉంది. ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు మధు విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు, ఆటల ద్వారా వారిలో విద్యపై ఆసక్తిని రగిలించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్. విజయలక్ష్మి నేతృత్వంలో.. ఉపాధ్యాయులు నరసింహ చారి (భౌతిక శాస్త్రం), వెంకటేశ్వర్లు (హిందీ), రవీందర్ (జీవ శాస్త్రం), శ్రీనివాస్ (సాంఘిక శాస్త్రం), ఎలంధర్ రెడ్డి, కనకయ్య (గణితం), మధు (పీఈటీ), విజయ్ (తెలుగు), మౌనిక (ఆంగ్లం) సబ్జెక్టులను ఎంతో శ్రద్ధగా బోధించారు. విద్యార్థులపై నిత్యం పర్యవేక్షణ చేయడమే ఈ వంద శాతం ఉత్తీర్ణతకు కారణమైంది. డీఈవో కందుల సత్యనారాయణ, ఎంఈఓ చందా రమేష్ తదితర స్థానిక ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ప్రైవేటు పాఠశాలలకు వేలకు వేలు ఫీజులు పోసి పిల్లలను పంపొద్దని, చక్కటి విద్యాబోధన, క్రమశిక్షణ అందిస్తున్న దూది వెంకటాపురం పాఠశాలలోనే చేర్పించాలని వారు తల్లిదండ్రులకు సూచించారు.

## కోతుల బెడద నివారణకు చైతన్య ఉద్యమం







**- వాదానికి తోడైన నాదం.. ఉద్యమానికి పబ్బోజు శోభారాణి పాట ఊపిరి**

**- వేదిక ఏదైనా సమస్య పరిష్కారమే లక్ష్యం: మార్త జగదీశ్వర్**

**- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు వినతిపత్రం అందజేత**

తొలివెలుగు, రాజాపేట: మండల పరిధిలో రైతులు, సాధారణ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న కోతుల బెడద నివారణ కోసం స్థానికంగా ఓ సామాజిక చైతన్య ఉద్యమం ఊపందుకుంది. ప్రముఖ వ్యాపారి, సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు మార్త జగదీశ్వర్ వానర విధ్వంసంపై ప్రారంభించిన పోరాటానికి ప్రముఖ గాయని పబ్బోజు శోభారాణి తన వంతు మద్దతు పలికారు. రైతుల కష్టాలను వివరిస్తూ ఆమె స్వయంగా రచించి, పాడిన పాట ఈ ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చింది.

**ఆలోచింపజేస్తున్న శోభారాణి గీతం**

ధర్మ, కర్మల పుణ్యభూమి అయిన మన దేశంలో రైతుల స్వేదాన్ని అక్షరాలుగా మారుస్తూ శోభారాణి తన గీతాన్ని ప్రారంభించారు. సుమారు నాలుగు నిమిషాల నిడివి గల ఈ పాట ఆద్యంతం ఆలోచింపజేసేలా సాగింది. ఆరుగాలం శ్రమించి, రక్తాన్ని చెమటగా మార్చి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి కోతులు నాశనం చేస్తుండటంతో రైతులు పడుతున్న నిర్వేదాన్ని ఆమె తన పాటలో కళ్లకు కట్టారు. ఇదే పరిస్థితి కొనసాగితే సాగు భూములన్నీ బీడు భూములుగా మారే ప్రమాదం ఉందని, అన్నదాతలను భిక్షకులుగా మార్చే పరిస్థితి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దైవ స్వరూపంగా భావించే వానరాలు.. పంట నాశకులుగా మారడం బాధాకరమన్నారు. గుండె చెదిరి రాసిన ఈ పాట ప్రతి ఒక్కరినీ సామాజిక చైతన్యంలో భాగస్వాములను చేసేలా ఉందంటూ పలువురు ప్రశంసిస్తున్నారు.

**పట్టువదలని విక్రమార్కుడిలా మార్త జగదీశ్వర్..**

కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఒకే ఒక్క వాదంతో మార్త జగదీశ్వర్ ముందుకు సాగుతున్నారు. కవులు, రచయితల సమావేశమైనా, ఆధ్యాత్మిక కార్యక్రమమైనా, గ్రామ పంచాయతీ సభ అయినా.. వేదిక ఏదైనా ఆయన కోతుల బెడదపైనే ఉపన్యసిస్తూ ప్రజలను ఆలోచింపజేస్తున్నారు. తన వాదనను బలంగా వినిపించడంతో పాటు, నిత్యం వాట్సాప్ గ్రూపుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కలిసి, కోతుల వల్ల కలుగుతున్న నష్టాలను వివరిస్తూ తక్షణమే నివారణా చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఈ సామాజిక చైతన్య ఉద్యమం ఆగదని ఆయన స్పష్టం చేశారు.

## సాంకేతిక విద్యతోనే ఉపాధి గ్యారెంటీ





**- డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ కోర్సుపై విద్యార్థులకు అవగాహన**

**- నెలవారీ స్టైఫండ్ సదుపాయం.. నామమాత్రపు ఫీజు**

**- సద్వినియోగం చేసుకోవాలి: చేనేత శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు**

**తొలివెలుగు, చౌటుప్పల్:** పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సంప్రదాయ కోర్సులతో పాటు వంద శాతం ఉపాధి కల్పించే సాంకేతిక వృత్తి విద్యా కోర్సుల వైపు మొగ్గు చూపాలని యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎ. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐ ఐ ఎచ్ టీ) ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2026 - 27 విద్యా సంవత్సరానికి గానూ డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ (డీ ఎచ్ టీ టీ) కోర్సు విశిష్టతను ఆయన వివరించారు. నేటి ఆధునిక కాలంలో చేనేత రంగం కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ (సీఏడీ), టెక్స్‌టైల్ కెమిస్ట్రీ వంటి అంశాలతో అంతర్జాతీయ స్థాయికి చేరుకుందన్నారు. ప్రభుత్వం ఈ కోర్సు చదివే విద్యార్థులకు నెలకు రూ. 2,500, చేనేత కుటుంబాల వారికి రూ. 5,000 స్టైఫండ్ అందిస్తుందని పేర్కొన్నారు. ఏడాదికి కేవలం రూ. 4,250 ఫీజుతో నాణ్యమైన విద్యను అభ్యసించే ఈ అవకాశాన్ని జిల్లా విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు మే 10వ తేదీలోపు నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదస్సులో ఎనిమిది మంది విద్యార్థుల నుంచి అడ్మిషన్ దరఖాస్తులను స్వీకరించారు.

## ప్రజల చెంతకే పాలన.. చౌటుప్పల్‌లో మళ్లీ 'ప్రజావాణి'

**- ప్రతి సోమవారం ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభం**

**- ఈ నెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**- ఎంపీడీవో మీటింగ్ హాల్‌లో దరఖాస్తుల స్వీకరణ**

**- ఏర్పాట్లు పూర్తి చేసిన రెవెన్యూ యంత్రాంగం**

**- ఐదు మండలాల ప్రజలకు తప్పనున్న తిప్పలు**

**- ఆర్డీవో వి. శేఖర్ రెడ్డి వెల్లడి**




**తొలివెలుగు, చౌటుప్పల్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 4వ తేదీ నుంచి 'ప్రజావాణి' కార్యక్రమాన్ని పునఃప్రారంభించనున్నట్లు చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) వి. శేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, పాలనను ప్రజలకు మరింత చేరువ చేసే ఉద్దేశంతో డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం చౌటుప్పల్ మండల పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయ సమావేశ మందిరాన్ని వేదికగా ఎంపిక చేసినట్లు చెప్పారు. చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వచ్చే చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, రామన్నపేట, వలిగొండ, భూదాన్‌పోచంపల్లి మండలాలకు చెందిన ప్రజలు తమ భూ సమస్యలు, రెవెన్యూ సంబంధిత ఇబ్బందులు, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఇక్కడ నేరుగా అధికారులకు అందజేయవచ్చని సూచించారు. ప్రతి సోమవారం ఉదయం ఈ ప్రజావాణి కార్యక్రమం నిరవధికంగా కొనసాగుతుందని, డివిజన్ స్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉండి ప్రజల వినతులను స్వీకరిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఐదు మండలాల ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లే శ్రమ లేకుండా, డివిజన్ కేంద్రంలోనే ఏర్పాటు చేసిన ఈ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో శేఖర్ రెడ్డి కోరారు.

## చేపల వేటకు వెళ్లి వలస కార్మికుడి దుర్మరణం

**- ఆసిఫ్‌నగర్ కాలువలో గల్లంతై ఒడిశా యువకుడి మృతి**

**- బురదలో కూరుకుపోయి ప్రాణాపాయం**

**- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రామన్నపేట ఎస్ఐ నాగరాజు**



తొలివెలుగు, రామన్నపేట: ఉపాధి నిమిత్తం సుదూర ప్రాంతం నుంచి వచ్చిన ఓ వలస కార్మికుడిని మృత్యువు కాలువ రూపంలో కబళించింది. సెలవు దినం కావడంతో సరదాగా చేపలు పడదామని వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. రామన్నపేట ఎస్ఐ డి. నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని బండిగూడ గ్రామానికి చెందిన శేషాద్రి కుమార్, తన బంధువైన రాజు ఖిలో (20) తదితరులు సెంట్రింగ్ పని నిమిత్తం 20 రోజుల క్రితం రామన్నపేట వచ్చారు. మే 1వ తేదీ కార్మిక దినోత్సవం సందర్భంగా పనికి సెలవు దొరకడంతో.. శేషాద్రి కుమార్, రాజు ఖిలో, వారి బాబాయ్ కలిసి దుబ్బాక మీదుగా ఉన్న లచ్చిరెడ్డి గూడెం శివారులోని ఆసిఫ్‌నగర్ కాలువ వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో కాలువలో చేపలు పట్టేందుకు నీళ్లలోకి దిగారు. కాలువలో ఒక్కసారిగా ప్రమాదవశాత్తూ రాజు ఖిలో బురదలో కూరుకుపోయాడు. ఈదులాడే ప్రయత్నం చేసినప్పటికీ, బురద ఎక్కువగా ఉండటంతో ఊపిరాడక నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. తోటివారు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. మృతుడి బంధువు శేషాద్రి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు వెల్లడించారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..






## ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం

- చౌటుప్పల్ బస్ స్టేషన్‌లో ప్రారంభం
- శ్రీ బాలాజీ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- సామాజిక బాధ్యతగా కొనసాగిస్తున్నామన్న కృష్ణారామ్ చౌదరి

**తొలివెలుగు, చౌటుప్పల్ :** వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్ స్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు కొనియాడారు. స్థానిక శ్రీ బాలాజీ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆ మాల్ యజమాని, ప్రముఖ వ్యాపారవేత్త కృష్ణారామ్ చౌదరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకూ పెరుగుతున్న ఎండల కారణంగా బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి దప్పిక తీర్చాలన్న సదుద్దేశంతోనే ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. గత కొన్నేళ్లుగా వేసవిలో ఈ సదుపాయాన్ని క్రమం తప్పకుండా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని గుర్తుచేశారు. వ్యాపార రంగంలో రాణించడంతో పాటు, సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్లు బొప్పని ఆనందరావు, యాదయ్య, స్థానిక ప్రముఖులు కాసుల రఘు, ముత్యాల హనుమంతరెడ్డి, రాజేష్, ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లతో పాటు పలువురు ప్రయాణికులు పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకులు అందజేత

- వార్డు కౌన్సిలర్ చక్రపాణి పరామర్శ
- బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** పురపాలక కేంద్రంలోని నాలుగో వార్డుకు చెందిన మూటపురం సందీప్ అకాల మరణం ఆ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. ఈ క్రమంలో మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు స్థానిక నాయకులు ముందుకు వచ్చారు. శనివారం నాలుగో వార్డు కౌన్సిలర్ పెద్దల చక్రపాణి బాధిత కుటుంబాన్ని సందర్శించి, వారిని పరామర్శించారు. సందీప్ మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దల కుమార్ ఆధ్వర్యంలో మానవతా దృక్పథంతో బాధితులకు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కష్టకాలంలో ఆ కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు పోతగల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల లింగస్వామి, పెద్దల యాదయ్య, పోతగల్ల సతీష్, మూటపురం మల్లేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాకుసుమాల వెల్లువ.. డీఈవోకు సత్కారం

- వంద శాతం ఫలితాలతో మండల జోరు
- సన్మానించిన పీఆర్టీయూ నేత నరసింహారావు



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** పదవ తరగతి ఫలితాల్లో భూదాన్ పోచంపల్లి మండలం ఉత్తమ ప్రతిభ కనబరచడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) సత్యనారాయణను శనివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించిన నేపథ్యంలో, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి సిరికొండ నరసింహారావు జిల్లా కేంద్రంలో డీఈవోను కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ స్థాయిలో రాణించడానికి డీఈవో అందించిన ప్రోత్సాహం, ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు అందించిన దిశానిర్దేశం ఎంతో తోడ్పడ్డాయని కొనియాడారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో రానున్న విద్యాసంవత్సరంలోనూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పీఆర్టీయూ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు ప్రైవేటుకు దీటుగా రావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

# మట్టి దందా.. కాసుల పండగ!





- ఇటుక బట్టీలకు మట్టి.. మాఫియాకు అధికారుల సలాం
- బొల్లంరాజు కుంట, రామసముద్రం చెరువుల్లో లూటీ
- పగలు, రాత్రి అనే తేడాలేదు.. నిబంధనల జాడే లేదు
- ఓవర్‌లోడ్ టిప్పర్లతో చిధ్రమవుతున్న గ్రామీణ రోడ్లు
- కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా దొరకని న్యాయం

**తొలివెలుగు, వలిగొండ/యాదాద్రి భువనగిరి:** జిల్లాలో మట్టి దందా కాసుల పండుగలా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ రైతులు తమ సొంత పొలాల్లో మట్టిని వినియోగించుకునేందుకు అనుమతులు కోరితే నిబంధనల పేరుతో అడ్డంకులు సృష్టించే అధికారులు, ఇటుక బట్టీల వ్యాపారులకు మాత్రం మిషన్ కాకతీయ పేరుతో ఇష్టారాజ్యంగా అనుమతులు జారీ చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

వలిగొండ మండలం గోకారం గ్రామంలోని బొల్లంరాజు కుంట, రామసముద్రం చెరువుల నుంచి మట్టి తరలింపులో భారీ ఎత్తున అక్రమాలు జరుగుతున్నా, సంబంధిత జిల్లా అధికారులు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### నిబంధనలకు పాతర.. రాత్రింబవళ్లు తరలింపు

ఇరిగేషన్ శాఖ మట్టి తరలింపుపై పలు నిబంధనలు విధించినప్పటికీ, అవి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే తరలింపులు జరగాలని స్పష్టం చేసినా, రాత్రింబవళ్లు టిప్పర్లు తిరుగుతున్నాయి. ప్రతిరోజూ ఇంజినీర్ పర్యవేక్షణలో పనులు జరగాల్సి ఉన్నా, అధికారులు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని గ్రామస్తులు అంటున్నారు.

### ఓవర్‌లోడ్ టిప్పర్ల దౌర్జన్యం

చౌటుప్పల్, నారాయణపురం మండలాల దిశగా పదుల సంఖ్యలో టిప్పర్లు ఓవర్‌లోడ్‌తో మట్టిని తరలిస్తున్నాయి. దీంతో గోకారం, నేలపట్ల పరిసర ప్రాంతాల్లోని గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయి. మట్టి వ్యాపారులు కోట్ల రూపాయలు గడిస్తుండగా, స్థానిక ప్రజలు, రైతులు మాత్రం రోడ్లపై తిరగలేక, దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నారు.

### ఫిర్యాదులు చేసినా చర్యలు లేవు

గ్రామసభలోనే రైతులు, గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధుల అండతో ఏకపక్షంగా తీర్మానాలు ఆమోదించారన్న విమర్శలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్, తహసీల్దార్‌కు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, స్థానికుల అభ్యంతరాలు వస్తే అనుమతులు రద్దు చేస్తామని చెప్పిన అధికారులు, ఇటీవలే మరో 15 రోజులపాటు అనుమతులను పొడిగించడం. దీని వెనుక భారీగా ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### కోట్లలో వ్యాపారం.. ప్రజలకు ఇబ్బందులు

మట్టి తరలింపుతో ఇటుక బట్టీల వ్యాపారులు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారని సమాచారం. ఒకేసారి పదుల సంఖ్యలో టిప్పర్లు తిరుగుతూ గ్రామాల్లో దుమ్ము, కాలుష్యం పెంచుతున్నాయి. ప్రజలు రోడ్లపై నడవడానికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపును అరికట్టి, నిబంధనలు కఠినంగా అమలు చేయాలని స్థానిక రైతులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పెద్దగూడెంలో ఐకేపీ కేంద్రం ప్రారంభం
- 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు
- వెల్లడించిన సర్పంచ్ ఫక్కీరు లతా నర్సిరెడ్డి



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** రైతులు తాము పండించిన ప్రతి గింజను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని పెద్దగూడెం సర్పంచ్ ఫక్కీరు లతా నర్సిరెడ్డి కోరారు. శనివారం మండలంలోని పెద్దగూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా ధాన్యపు రాశులకు పూజలు నిర్వహించి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న కనీస మద్దతు ధరను అందిపుచ్చుకోవాలన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇది రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూకం, రవాణా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం త్వరియ నాయక్, నాయకులు మాజీ సర్పంచ్ మన్నె పద్మా రెడ్డి, కందాడి యాదిరెడ్డి, ఫక్కీరు సుధాకర్ రెడ్డి, మన్నే ప్రభాకర్ రెడ్డి, కనుమోని దానయ్య తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్‌గా వేంకటేశ్వర నాయక్

**తొలిరోజే పారిశుధ్యం, మౌలిక వసతులపై దృష్టి**

**చైర్‌పర్సన్ పావనిని కలిసిన నూతన కమిషనర్**

**- అభివృద్ధికి సహకరించాలని విన్నపం**



**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా వేంకటేశ్వర నాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పురపాలక కార్యాలయానికి చేరుకున్న ఆయనకు సిబ్బంది, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ఇతర సమస్యలపై ఆమెతో ప్రాథమికంగా చర్చించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణలో రాజీ పడబోమని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. విధుల్లో చేరిన కమిషనర్‌కు మున్సిపల్ సిబ్బంది పర్యావరణ హితంగా మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## పేకాట స్థావరంపై దాడి.. నలుగురు అరెస్టు

- రూ.51,200 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం - వెల్లడించిన సీఐ మన్మథ కుమార్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** పట్టణంలోని హెచ్ఎండిఏ వెంచర్ ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ రోడ్డులోని ఓ నివాసంలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. ఎస్ హెచ్ ఓ ఆదేశాల మేరకు ఎస్ఐ బి. అజయ్ భార్గవ్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి 9:30 గంటల సమయంలో హెచ్ఎండిఏ వెంచర్‌లోని సురేష్ అనే వ్యక్తి ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న బోధుల శ్యామ్, చుక్క నర్సింహ, ఉష్కాగుల సురేష్, నందగిరి నరేష్‌లను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి రూ. 51,200 నగదుతో పాటు 4 సెల్‌ఫోన్లు, రెండు సెట్ల పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరూ చౌటుప్పల్ పరిసర ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. పట్టణంలో జూదక్రీడలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్లు

- పులిగిల్లలో ఐకేపీ కేంద్రాన్ని తనిఖీ చేసిన తహశీల్దార్ దశరథ
- తూకాల్లో పారదర్శకత పాటించాలని ఆదేశం



**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల తహశీల్దార్ దశరథ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి వస్తున్న ధాన్యం నిల్వలు, తూకం వేస్తున్న తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో ఆయన ముచ్చటించి, ధాన్యం సేకరణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని, తూకాల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఏ చిన్న ఇబ్బంది కలిగినా సహించేది లేదని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

## ప్రజా పోరాటాలే కమ్యూనిస్టులకు నివాళి

- బైకాని నరసింహ స్మారక స్థూపావిష్కరణ
- హాజరైన సిపిఎం నేతలు చెరుపల్లి, జహంగీర్
- పల్లివాడలో ఘనంగా సంతాప సభ





**తొలివెలుగు, రామన్నపేట :**సామాజిక మార్పు కోసం, పేదల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే కమ్యూనిస్టులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పేర్కొన్నారు. మండలంలోని పల్లివాడ గ్రామంలో సిపిఎం సీనియర్ నాయకుడు బైకాని నరసింహ స్మారక స్థూపాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నరసింహ చిన్నతనం నుంచే ఉన్నత భావాలతో పార్టీ బలోపేతానికి, ప్రజా ఉద్యమాలకు విశేష కృషి చేశారన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. నేటి రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరిగి ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోందని చెరుపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ధరల భారంతో సామాన్యుడి వెన్ను విరుస్తున్నాయని విమర్శించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జహంగీర్ మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన వైద్యం అందకపోవడం వల్లే నరసింహ వంటి నాయకులను కోల్పోతున్నామని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. సభలో ప్రజానాట్యమండలి కళాకారులు అమరవీరుల గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో జిల్లా నేతలు కల్లూరి మల్లేశం, జల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, సర్పంచ్ కంబంపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ చేరాలి

- అర్హులందరికీ పథకాల వర్తింపు.. అధికారులకు ఎమ్మెల్యే కుంభం ఆదేశం
- రాయగిరిలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సమీక్ష
- జూన్ 2 నుంచి బడిలో అల్పాహారం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం







**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలని, అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయగిరిలోని సోమా రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పురోగతిని సమీక్షించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో సామాన్యుడిపై ఆర్థిక భారం తగ్గిందని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, రెండో విడతలో మరిన్ని మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్న ఆయన.. జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం ద్వారా పేదలకు ధైర్యం లభించిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వేదికపై 'నాగార్జున స్కూల్'కు అరుదైన గౌరవం

**మలేషియాలో 'మోస్ట్ ప్రామిసింగ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ప్రదానం**

**- 'ఉత్తమ ప్రిన్సిపాల్'గా రేఖ - హర్షం వ్యక్తం చేసిన కరస్పాండెంట్ డాక్టర్ నాగరాజు నకిరేకంటి**




**తొలివెలుగు, రామన్నపేట:** మండల కేంద్రంలోని ప్రతిష్ఠాత్మక నాగార్జున స్కూల్ విద్యా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించింది. మలేషియా దేశంలోని వైందం కలంగ్ వేదికగా ఘనంగా జరిగిన 'గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ – 2026'లో నాగార్జున స్కూల్ 'మోస్ట్ ప్రామిసింగ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్' పురస్కారాన్ని దక్కించుకుంది. గ్లోబల్ ట్రింఫ్ ఫౌండేషన్, బ్రిక్స్ ఏషియన్ – బిజినెస్ ఆఫ్ కామర్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ అంతర్జాతీయ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మలేషియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చేతుల మీదుగా నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ నాగరాజు నకిరేకంటి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. అలాగే, పాఠశాల అభివృద్ధిలో అద్భుతమైన కృషి చేస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి రేఖ 'బెస్ట్ ప్రిన్సిపాల్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్' అవార్డును స్వీకరించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గాను ఈ పురస్కారాలు వరించాయి. అంతర్జాతీయ స్థాయిలో తమ పాఠశాలకు గుర్తింపు రావడం పట్ల డాక్టర్ నాగరాజు, శ్రీమతి రేఖ హర్షం వ్యక్తం చేశారు. మలేషియాలో ఈ అవార్డులు అందుకున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌లను పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, మిత్రులు, స్థానిక ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

# 'టీచర్'గా సిమ్రాన్..

## విజయ్ సేతుపతి చేసిన టైటిల్‌ట అనౌటన్స్‌మెంట్ వీడియో!




నటి సిమ్రాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త సినిమాకు 'టీచర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దర్శకుడు బాలు శర్మ తెరకెక్కిస్తున్న ఈ సైకలాజికల్ డ్రామా టైటిల్ వీడియోను విజయ్ సేతుపతి విడుదల చేశారు. స్కూల్ నేపథ్యంలో సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో సిమ్రాన్ టీచర్‌గా కనిపించనున్నారు. ఇటీవల 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో భారీ విజయాన్ని అందుకున్న సిమ్రాన్, ఇప్పుడు ఈ విభిన్నమైన కథతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'టీచర్'గా సిమ్రాన్.. విజయ్ సేతుపతి లాంచ్ చేసిన టైటిల్ నటి సిమ్రాన్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. ఆమె ఒకప్పుడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా రాణించారు. చిరంజీవి, అక్కినేని నాగార్జున, నందమూరి బాలకృష్ణ, వెంకటేష్, మహేష్ బాబు వంటి అగ్ర హీరోలందరికి జోడీగా నటించారు. తెలుగుతో పాటుగా తమిళం, మలయాళం, కన్నడ భాషల్లోనూ అలరించారు. దశాబ్దకాలం పాటు టాప్ హీరోయిన్ గా వెలుగొందిన సిమ్రాన్.. పెళ్లి తర్వాత క్యారక్టర్ ఆర్టిస్టుగా సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టారు. అవకాశం వచ్చినప్పుడు ఫీమేల్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఆమె కొత్త సినిమాని అనౌన్స్ చేశారు.

సిమ్రాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీకి 'టీచర్' అనే టైటిల్ ను ఖరారు చేశారు. బాలు శర్మ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇదొక సైకలాజికల్ డ్రామా. సూపర్ టాకీస్, వైట్ నైట్ సెంట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ పై సమీర్ భరత్ రామ్, కాశీ విశ్వనాథన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి గురువారం తన సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా ఈ మూవీ టైటిల్ అనౌన్స్ మెంట్ వీడియోను లాంచ్ చేసి, చిత్ర బృందానికి బెస్ట్ విషెస్ అందజేశారు.

సిమ్రాన్ తదుపరి చిత్రం 'టీచర్' టైటిల్ ను ఆవిష్కరించడానికి సంతోషిస్తున్నాను. చిత్ర బృందం మొత్తానికి శుభాకాంక్షలు" అని విజయ్ సేతుపతి ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. ఇందులో టైటిల్ కి తగ్గట్టుగా ఒక క్లాస్ రూమ్, బ్లాక్ బోర్డ్ ను చూపిస్తూ.. తుపాకీ పట్టుకొని ఉన్న ఒక చేయి నీడని ప్రజెంట్ చేశారు. అసలు ఒకదానికొకటి సంబంధమే లేకుండా, విద్యాబుద్ధులు నేర్పించే స్కూల్ లో గన్ చూపించి ఆసక్తిని రేకెత్తించారు. ఈ సినిమాలో సిమ్రాన్ ఒక టీజర్ గా కనిపించనున్నారు. ఒక టీజర్ కి క్రైమ్ తో లింకేంటి? దీని వెనకున్న కథేంటనేది తెలియాలంటే, ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే.

# ప్రేమలో 'బుట్టబొమ్మ'..




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే ప్రేమలో పడినట్లు గత కొన్ని రోజులుగా సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. బాలీవుడ్ నటుడు, దివంగత వినోద్ మెహ్రా కుమారుడు రోహన్ మెహ్రాతో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ కలిసి ముంబైలోని పలు రెస్టారెంట్లు మరియు పార్టీల్లో చెట్టాపట్టాలేసుకుని తిరగడం, అలాగే పూజ తల్లిదండ్రులతో కలిసి రోహన్ డిన్నర్ వేడుకల్లో పాల్గొనడం ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది. వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఈ వార్తలపై పూజ ఇంకా స్పందించనప్పటికీ, సోషల్ మీడియాలో వీరి జోడీకి మంచి మార్కులు పడుతున్నాయి.

టాలీవుడ్‌లో తన అందం, అభినయంతో కుర్రకారు గుండెల్లో 'బుట్టబొమ్మ'గా సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న పూజా హెగ్డే ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి ఆమె సినిమాల గురించి కాకుండా, తన వ్యక్తిగత జీవితం, ప్రేమాయణం గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. గత కొంతకాలంగా తన రిలేషన్ షిప్ విషయంలో చాలా గోప్యంగా ఉంటూ వస్తున్న ఈ బ్యూటీ ప్రస్తుతం ఒక బాలీవుడ్ కుర్ర హీరోతో పీకల్లోతు ప్రేమలో ఉందనే వార్త సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్ అయ్యింది.

**ఎవరా మిస్టరీ మ్యాన్?**

పూజా హెగ్డే మనసు గెలుచుకున్న ఆ కుర్రాడు మరెవరో కాదు.. బాలీవుడ్ దివంగత నటుడు వినోద్ మెహ్రా కుమారుడు రోహన్ మెహ్రా . రోహన్ 2018లో సైఫ్ అలీ ఖాన్ నటించిన 'బజార్' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. పూజా, రోహన్ గత కొంతకాలంగా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుండటంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ముంబైలోని ప్రముఖ రెస్టారెంట్లు, పలు సినీ వేడుకల్లో ఈ జంట కలిసి కనిపించడం ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది. 2024లో పూజ తన తల్లిదండ్రులతో కలిసి డిన్నర్‌కు వెళ్లిన సమయంలో రోహన్ కూడా వారి వెంటే ఉండటం, తాజాగా వీరిద్దరూ ఒకే కారులో ప్రయాణించడం చూస్తుంటే.. వీరి బంధం కేవలం స్నేహానికే పరిమితం కాదని, పెళ్లి వైపు అడుగులు వేస్తున్నారని అభిమానులు భావిస్తున్నారు. అంతేకాకుండా, గతంలో పూజ పుట్టినరోజు సందర్భంగా రోహన్ చేసిన ఒక స్పెషల్ ఇన్‌స్టా పోస్ట్‌ను కూడా ఇప్పుడు నెటిజన్లు వెలికితీసి వైరల్ చేస్తున్నారు.

